మరమ్మతులకు నిధులు మంజూరు

- గతంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు
- మంత్రి వేముల చొరవతో నిధులు


వర్షాలతో గుమ్మిర్యాల్ వద్ద కుంగిపోయిన రోడ్డు

మోర్తాడ్: భారీగా కురిసిన వర్షాలతో కుంగిపోయిన రోడ్డు మరమ్మతులకు రూ.14 లక్షల నిధులు మంజూరయ్యాయి. గుమ్మిర్యాల్ వద్ద రోడ్డు కుంగిపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించేవారు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపడితే నిజామాబాద్, నిర్మల్ జిల్లాల మధ్య రాకపోకలకు అంతరాయం ఉండదని స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన నిధులను మంజూరు చేయించారు. రోడ్డు పక్కన కుంగిపోవడంతో రాత్రిపూట ప్రయాణించేవారు అందులో పడిపోయే అవకాశం ఉంది. వేసవి ముగిసేలోగా పనులు పూర్తి చేస్తే రాకపోకలకు ఇబ్బంది ఉండదని గ్రామస్తులు చెబుతున్నారు. ఆర్అండ్‌బీ ఇంజినీర్లు ప్రతిపాదనలు తయారు చేసి అంచనాలు వేయడంతో నిధులు మంజూరయ్యాయి. పనులను ప్రారంభించడమే మిగిలి ఉందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని వెంటనే పనులు ప్రారంభించడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరుతున్నారు.

పూర్తయితే రాకపోకలకు ఇబ్బంది ఉండదు



గుమ్మిర్యాల్ వద్ద రోడ్డు కుంగిపోగా మరమ్మతుల కోసం మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేశారు. పనులు పూర్తయితే రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. తొందరగా నిధులు మంజూరు చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు.

– గడ్డం లింగారెడ్డి, గుమ్మిర్యాల్

నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్


ఏసీపీ కార్యాలయం వద్ద కుల సంఘాల సభ్యులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం ఆలూర్‌లో కొన్ని రోజుల కిత్రం మాజీ సర్పంచ్ మెట్టు నరేష్‌పై దాడిని చేసిన నిందితులను వెంటనే ఆరెస్టు చేయాలని ఇస్సాలి గ్రామానికి చెందిన వివిధ కుల సంఘాల సభ్యులు ఏసీపీ ప్రభాకర్‌రావు కలిసి విన్నవించారు. ఆర్మూర్ ఏసీపీ కార్యాలయంలో గురువారం ఇస్సాలి గ్రామం నుంచి వివిధ కుల సంఘాల సభ్యులు గురువారం ఏసీపీ కార్యాలయానికి ర్యాలీగా వచ్చారు. దాడికి పాల్పడ్డ ఇద్దరినీ వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసి 10 రోజులు గడుస్తున్నా ఎందుకు అరెస్టు చేయడం లేదని పోలీసులను ప్రశ్నించారు. బాధితుడు వెంట కొల వెంకటేశ్, విట్టవం జీవన్, వివిధ కుల సంఘాల సభ్యులు ఉన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయ పోస్టును అప్‌గ్రేడ్ చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

ఆర్మూర్‌టౌన్: వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టును ఎస్ఏ పీఈగా అప్‌గ్రేడ్ చేయాలని వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మోహన్‌దాస్ డిమాండ్ చేశారు. పట్టణంలోని రాంమందిర్ పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా మోహన్ దాస్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో జరిగిన తెలుగు మహాసభలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోని పండిత, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను అప్ గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు అప్‌గ్రేడ్ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎం చలం, వ్యాయమ ఉపాధ్యామ సంఘం నాయకులు గంగాధర్, పింజ సురేందర్, రాజేష్, సునీత, తదితరులు పాల్గొన్నారు.


వేల్పూర్‌లో పీఆర్‌టీయూ జెండాను ఎగురవేస్తున్న మండల అధ్యక్షుడు గంట అశోక్


బోధన్‌లో జెండా ఆవిష్కరిస్తున్న సంఘం డివిజన్ అధ్యక్షులు ఎంబెల్లి శంకర్, పాల్గొన్న నాయకులు

పీఆర్‌టీయూ ఆవిర్భావ వేడుకలు

పీఆర్‌టీయూ ఆవిర్భావ వేడుకలు గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ఎల్లప్పుడూ ముందుంటుందని, ఉపాధ్యాయ రంగానికి ఎంతో సేవ చేస్తోందని నేతలు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. పీఆర్‌టీయూ జెండాలను ఆవిష్కరించారు.

– భీమ్‌గల్/వేల్పూర్/ఎడపల్లి/బోధన్


ఎడపల్లిలో.. మండల అధ్యక్షుడు అభిమన్యు


భీమ్‌గల్‌లో..

క్రీడల్లో ఫుడ్ సైన్స్ విద్యార్థుల ప్రతిభ



రుద్రూర్: అక్బర్‌నగర్ శివారులోని ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాల(ఫుడ్ సైన్స్) విద్యార్థులు అంతర కళాశాలల క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల క్రీడల పోటీలు నిర్వహించగా పది బహుమతులు వచ్చినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్. స్వామి తెలిపారు. క్యారమ్, రన్నింగ్, కల్చరల్ గ్రూప్ డ్యాన్స్, పొయట్రీ, క్రియేటివిటీ ఆర్ట్స్ విభాగాల్లో బహుమతులు సాధించినట్లు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల అధ్యాపక బృందం అభినందించింది.

కోతులకు ఆహారం అందజేత



మాక్లూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయ సముదాయంలో సంచరిస్తున్న కోతులకు గురువారం తహసీల్దార్ శంకర్ ఆహారంగా పండ్లను అందించారు. ఆకలితో అలమటిస్తూ కోతులు ప్రతి రోజూ చేస్తున్న హంగామాతో స్పందించిన తహసీల్దార్ శంకర్ పెద్ద ఎత్తున పండ్లు కొనుగోలు చేసి వాటికి ఆహారంగా అందించారు. దీంతో కోతులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆ పండ్లను ఇష్టంగా తిన్నాయి. కోతుల్లో ఉన్న ఆకలిని గమనించి ఇలా చేసినట్టు తహసీల్దార్ శంకర్ వెల్లడించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో గురువారం స్థానిక సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో కళాజాత బృందం సభ్యులతో ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ లావాదేవీల్లో జరిగే మోసాలను ఖాతాదారులకు వివరించారు. అదేవిధంగా సహస్ర డిపాజిట్ పథకం గురించి వివరించారు. బ్యాంక్ మేనేజర్ అజయ్, సిబ్బంది అరుణ్, మనీషా, ఐశ్వర్య, గంగాధర్ పాల్గొన్నారు.

వేములవాడకు ప్రత్యేక బస్సులు

ఆర్మూర్ : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఆర్మూర్ నుంచి వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేశామని గురువారం డిపో మేనేజర్ కవిత తెలిపారు. ఈ నెల 17 నుంచి 19 వరకు ఆర్మూర్, పెర్కిట్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి నుంచి స్పెషల్ బస్సులు వేములవాడకు వెళ్తాయని పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగ చేసుకోవాలని కోరారు.

వీరశైవ లింగాయత్‌లను ఓబీసీల్లో చేర్చండి

– జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన వీరశైవ లింగాయత్ రాష్ట్ర ప్రతినిధులు


ఢిల్లీలో వీరశైవ లింగాయత్ సమాజ్ ప్రతినిధులు

బోధన్: సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబడిన వీరశైవలింగాయత్‌లను ఓబీసీలలో చేర్చాలని కోరుతూ బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌ల నేతృత్వంలో జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాంను గురువారం ఢిల్లీలోని మహారాష్ట్ర భవన్‌లో వీరశైవ లింగాయత్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు కలిశారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు. ప్రస్తుతం వీరశైవ లింగాయత్‌లు బీసీ–డీలో కొనసాగుతున్నారు. ఎంపీలు వీరశైవ లింగాయత్‌ల స్థితిగతులను వినిపించగా.. ఓబీసీ చైర్మన్ సానుకూలంగా స్పందించారని, ఓబీసీలో చేర్చేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు ఉమ్మడి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ్ అధ్యక్షులు కందారే దిగంబర్ తెలిపారు. జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసేందుకు ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించిన ఎంపీ బీబీ పాటిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


పల్లకిలో స్వామివారిని తీసుకొని ధ్వజారోహణానికి తరలుతున్న భక్తులు

వైభవంగా బ్రహ్మోత్సవాలు


ధ్వజారోహణం చేస్తున్న పండితులు

మాక్లూర్: అడవి మామిడిపల్లి శివారు గుత్ప చౌరస్తా వద్ద గల అపురూప వేంకటేశ్వర ఆలయంలో ఆలయ చైర్‌పర్సన్ అమృతలత ఆధ్వర్యంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేశారు. గురువారం ధ్వజారోహణం, పల్లకిలో స్వామివారి ఊరేగింపు, నిత్య హోమం, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. శివారు గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొన్నారు. కొందరు భక్తులు సతీసమేతంగా హోమం నిర్వహించారు. అన్నదానం చేశారు.

నేడు కల్యాణోత్సవం

శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవం ఉంటుందని ఆలయ చైర్‌పర్సన్ అమృతలత తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి అనుగ్రహం పొందాలన్నారు.

క్లుప్తంగా

పట్టణ అభివృద్ధికి నిధులు ఇవ్వండి



బోధన్: పట్టణ అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేయాలని బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్, మంత్రి కేటీఆర్‌ను కోరారు. కేటీఆర్‌ను గురువారం హైదరాబాద్‌లో స్థానిక ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ కలిశారు. ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు. పట్టణ సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.

రుద్రూర్ జీపీ కార్యదర్శి బదిలీ

రుద్రూర్: రుద్రూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి విఠల్ రెడ్డి పదోన్నతిపై మెదక్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పంచాయతీ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ భాస్కర్‌కు అదనపు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించినట్టు మండల అభివృద్ధి అధికారి బాల గంగాధర్ తెలిపారు.

గోమాతకు అంత్యక్రియలు

వర్ని: జలాల్పూర్‌లో గోమాత చనిపోవడంతో గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. చనిపోయిన గోమాతకు ఊరేగింపు నిర్వహించి శోభాయాత్రగా శ్మశానానికి తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. హనుమాన్ మందిరానికి చెందిన గోవు గురువారం ఉదయం చనిపోయింది.

ప్రహరీ నిర్మాణానికి మార్కింగ్



బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి గురువారం మార్కింగ్ చేశారు. ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. పనులను వెంటనే ప్రారంభించాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ సూచించారు. బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్, వాహబ్, శ్యాం, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



బాల్కొండ: ముప్కాల్ మండలంలో పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం బీఆర్ఎస్ కార్యాలయం వద్ద ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. 9 మందికి చెక్కులు అందజేసినట్లు ఆయన తెలిపారు. మంజూరుకు కృషి చేసిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఉమా శంకర్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ అందజేత

భీమ్‌గల్: గత సెప్టెంబర్ నెలలో నిర్వహించిన జాతీయ మానవ హక్కుల శిక్షణ తరగతులకు సంబంధించిన సర్టిఫికెట్‌ను జాతీయ మానవ హక్కుల సంఘం భీమ్‌గల్ మండల అధ్యక్షుడు రాహుల్, జిల్లా సీపీ నాగరాజు చేతుల మీదుగా గురువారం అందుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయడానికి, వారి హక్కుల కోసం పోరాడటానికి ఎల్లప్పుడు కృషి చేస్తానని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు స్వప్న, మానవ హక్కుల జాతీయ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జిల్లా దీక్షలు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 53వ రోజుకు చేరాయి. దీక్షలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగారెడ్డి, న్యాయవాదులు రమేష్, నర్సిం కూర్చున్నారు.

వీడీసీ కార్యవర్గం ఎన్నిక



కమ్మర్‌పల్లి: నాగాపూర్‌లో గురువారం గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బసకొండ మహేష్, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ దేవదాస్, కోశాధికారిగా కొడ ప్రవీణ్, సలహాదారులుగా బొడ్డు శివానంద్, గంగాధర్, సభ్యులుగా సంజీవ్, గోవర్ధన్, చందు, వెంకటేష్, చిన్నరాజాం, శ్రీకాంత్, రంజిత్‌లు ఎన్నికయ్యారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


కంటి అద్దాలు అందజేస్తున్న పండిత్ వినీత

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ పర్సన్ పండిత్ వినీత అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 7, 10, 28వ వార్డులలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను ఆమె పరిశీలించారు. 18 సంవత్సరాల పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం అద్దాలు, ఉచితంగా మందులు, శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలోకౌన్సిలర్‌లు అథిక్, కొంతం మంజుల, వైద్యసిబ్బంది సూపర్‌వైజర్ చంద్రశేఖర్, ఆనంద్ పాల్గొన్నారు.

మగ్గిడిలో కంటి వెలుగు ప్రారంభం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ సుద్ద పల్లి సుమలత ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామస్తులు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కంటి వైద్య నిపుణులు గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు. వైద్యురాలు పూజా రెడ్డి పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో..

బాల్కొండ : శ్రీరాంపూర్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం స్థానిక సర్పంచ్ మంథని చిన్నయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును విజయవంతం చేయాలని కోరారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు దాసరి వెంకటేశ్, శ్యాం పాల్గొన్నారు.


మగ్గిడిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


శ్రీరాంపూర్‌లో ప్రారంభిస్తున్న సర్పంచ్ చిన్నయ్య

24 గంటల విద్యుత్ అందించాలి


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

మాక్లూర్: రైతులకు 24 గంటల పాటు త్రీఫేజ్ కరెంటు అందించాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం దాస్‌నగర్ సబ్‌స్టేషన్ వద్ద ఏఈకి రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. వేసవి ప్రారంభం అవుతుందని, రైతులు సాగు చేసిన పంటలకు బోరుబావులు ఎత్తిపోసే నీరు సరిపోవటం లేదన్నారు. వరి పంటలన్నీ పొట్ట దశలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఇస్తున్న 12 గంటల కరెంట్ రైతులకు సరిపోవటం లేదన్నారు. 24 గంటలు ఇవ్వకపోతే రైతులతో కలిసి సబ్‌స్టేషన్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు గంగోనే సంతోష్, మోహన్, వినోద్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి


నవీపేట నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న నాయకులు

నవీపేట(బోధన్) : ప్రజా సంఘాల ఐక్య పోరాట వేదిక ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయడానికి గురువారం నవీపేట్ మండల కేంద్రం నుంచి హైదరాబాద్ తరలి వెళ్లారు. బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు నాయక్ వాడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇళ్ల స్థలాలు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చి ఇప్పటికి ఎనిమిది ఏళ్లెనా నిర్మించకపోవడం విచారకరమన్నారు. ఖాళీ స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు రూ.3 లక్షలు ఇస్తాననడం ఎంతవరకు సమంజసమన్నారు. అర్హులైన వారందరికీ రూ.ఐదున్నర లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు రమాదేవి, సావిత్రి, వసంత తదితరులు పాల్గొన్నారు.

రుణాల కోసం మైనారిటీలకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

భీమ్‌గల్ : మైనార్టీ కార్పొరేషన్ 2022–23 సంవత్సరానికి సంబంధించి రాయితీ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఎంపీడీవో రాజేశ్వర్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 319 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 220 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీవో గంగామోహన్, సీనియర్ అసిస్టెంట్ ప్రిన్స్, ఐకేపీ సీసీ నరేష్, ఎస్‌బీఐ, టీజీబీల బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

సమాచారం..

■ నేడు షిరిడీకి పాదయాత్ర

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం నుంచి శుక్రవారం షిరిడీకి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సాయిబాబా ఆలయ నిర్వాహకుడు వెంకటేశ్వర శర్మ తెలిపారు. గురువారం ఎడపల్లి సాయిబాబా ఆలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా సాయిబాబా ఆలయం నుంచి షిరిడీకి భక్తులతో కలిసి పాదయాత్ర చేస్తున్నామని, ఈసారి దాదాపు 40 మంది భక్తులతో పాదయాత్రగా వెళుతున్నట్లు తెలిపారు. పాదయాత్రగా వెళ్లడం ఇది తొమ్మిదోసారని చెప్పారు. ఆసక్తి ఉన్న సాయి భక్తులు పాదయాత్రకు రావచ్చని ఆయన కోరారు.

■ ముప్కాల్ సర్వసభ్య సమావేశం

బాల్కొండ: ముప్కాల్ మండల సర్వ సభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ సామ పద్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దామోదర్ గురువారం తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యుడు, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

■ 15న నవీపేట సర్వసభ సమావేశం

నవీపేట : ఈ నెల 15న ఎంపీపీ సంగెమ్ శ్రీనివాస్ అధ్యక్షతన నవీపేట మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాజిద్ అలీ గురువారం తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

■ 13న క్యాంపస్ సెలక్షన్స్

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో ఈ నెల 13న క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ సూర్యప్రకాష్, డైరెక్టర్ దుష్యంత్ తెలిపారు. టాస్క్(తెలంగాణ నైపుణాల అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించనున్నారని, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బీఈ, బీటెక్ పూర్తయిన విద్యార్థులతో పాటు చివరి ఏడాది చదువుతున్న వారు కూడా అర్హులన్నారు. ఈ క్యాంపస్ నియమాకాలు జెన్‌ప్యాక్ట్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించనున్నారని తెలిపారు.